**కథ**

# ఆనందానికి అర్హత

**కె. జ్యోతి**

**పక్కింట్లో అలారం మోతతో మెలకువ వచ్చింది గోపాలావుగారికి. వెంటనే పక్కమీద నుంచి లేవడానికి శరీరం సహకరించలేదు. కొంత వయసు వల్ల మరికొంత జనవరి నెల చలివల్ల కావచ్చు. కాసేపు కాళ్లు, చేతులు సాగదీసుకుని పక్కమీద నుంచి లేచి బాత్రూమ్‌కి వెళ్లివచ్చి మళ్లీ పడుకున్నారు. నిద్ర పడుతుందని కాదు. చేసే పనేమీ లేక కోడలు లేచి వంటింట్లో పని చేసుకుంటున్న ధ్వనులు వినిపిస్తున్నాయి. ఇంకో గంటకి లేచి కాలకృత్యాలు తీర్చుకున్నారు. బయటికి వచ్చేసరికి కోడలు కాఫీకప్పు అందించింది. పేపరు చూసి వాకింగ్‌కి బయలుదేరారు.**

శీతాకాలం కావడం వల్ల లేటుగా వాకింగ్‌కి వెళుతున్నారు. రెండు వీధులు నడిచి ఓ పార్కు దగ్గర చెట్టు కింద ఆగారు. అప్పటికే అక్కడ ఉన్న ఇద్దరు, ముగ్గురు పలకరింపుగా నవ్వారు. కాసేపటికి ఇంకో నలుగురు వచ్చి చేరారు. అందరూ దాదాపుగా ఒకే వయసువాళ్లు రిటైర్తై, బాధ్యతలు పూర్తిచేసిన వాళ్లు కొందరు గోపాలావు గారిలా భార్యా వియోగులయ్యారు కూడా. అంతా కాసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నారు. రాజకీయాల గురించి, పెరిగిపోతున్న ధరల గురించి గత జీవితంలో తమ ఉద్యోగాల గురించి, పెన్షన్ వగైరాల గురించి, ఒకాయన కొడుకు కోడళ్లపై నేరాలు చెప్పారు. ఇంకొకాయన మనవల ముద్దుముచ్చట్ల గురించి చెప్పారు. అందరూ ఎక్కువగా మాట్లాడుకున్నది మాత్రం ప్రస్తుతం వారి వారి అనారోగ్యం గురించి, గత జీవితపు వైభవం గురించి.

దాదాపు గంటన్నర అలా గడిపి అంతా ఇళ్లకు బయల్దేరారు. ఒకాయన మనవలని స్కూల్లో దింపాలి. ఇంకొకాయన ఫంక్షన్‌కి వెళ్లాలి. గోపాలావుగారికి ప్రత్యేకంగా పనేమీ లేకపోయినా, అక్కడే ఉండడానికి కారణమేదీ లేక ఇంటికి బయల్దేరారు. దగ్గర్లోనే స్కూల్లో పనిచేస్తున్న కోడలు ఆయన వాకింగ్ నుంచి వచ్చాక స్కూల్‌కి వెళుతుంది. ఆయన టైమ్‌కి వెళ్లకపోతే ఆమె కంగారు పడుతుంది.

గోపాలావుగారు వెళ్లేసరికే గేటులో రిక్షా ఆగి ఉంది. ఆయనకి టిఫిను, లంచ్‌ల గురించి చెప్పి హడావుడిగా ఆమె బయల్దేరింది. ఆయన స్నానం చేసి, టిఫిన్ చేసి పడక్కుర్చీలో వాలారు. రోజురోజుకీ జీవితం నిస్సారం అయిపోతోంది అనుకున్నారు. మోకాళ్ల నెప్పులు, బ్లడ్ ప్రెషర్ ముందు నుంచీ ఉంది. మొన్న ఒక నెల రోజులు దగ్గు పీడించింది. అంతకు ముందు మెడనెప్పి, ఎప్పుడూ ఏదో ఒక జబ్బు.

తను సర్వీసులో ఉన్నప్పుడు ఎంత యాక్టివ్‌గా ఉండేవాడు. ఇంటా బయటా ఎన్ని పనులు చక్కబెట్టే సాయం చేయలేదని తనకిష్టం లేని చిన్న ఉద్యోగంలో చేరిపోయాడు. మొదటి సంపాదన అందుకున్న రోజూ దానికి సంబంధించినదే. తొలిసారి కూతురు పుట్టింది. అందరూ బాధ్యతను గుర్తు చేశారు. ఊ అలాగే ఫీలయ్యాడు. రెండోసారి కొడుకు పుట్టినా భార్యకి పెద్ద జబ్బు చేసి గండం గడిచింది.

సమయం గడుస్తోంది. గోపాలావుకి ఏమీ పాలుపోవడం లేదు. అందరూ సామాన్యంగా ఆనందించే అతి ముఖ్యమైన సంఘటనలు జరిగిన రోజులలో కూడా తను సంపూర్ణంగా ఆనందం అనుభవించలేదే? ఇలా కాదు. యవ్వనంలోనో, బాల్యంలోనో సాధారణంగా అందరికీ హుషారుగా, ఆనందంగా ఉంటుంది. అప్పట్లో ఒక రోజులోకి వెళితే బాగుంటుందేమో! ఆలోచన తెగక ముందే భగవంతుని గొంతు వినిపించింది.

వాడు? ఆలోచనల్లోనే చిన్నగా కునుకుపడుతోంది ఆయనకు. ఒక్కసారి గతంలోకి వెళ్లి ఆనందంగా, అత్యంత ఆనందంగా ఒక్క రోజు గడిపితే ఎంత బాగుంటుంది. ఆ జ్ఞాపకాలతో మిగిలిన జీవితం గడిపేయొచ్చు. తన ఫ్రెండ్స్‌తో చెప్పుకోవచ్చు. ఒక్కసారి అలాంటి అవకాశం భగవంతుడిస్తే...ఎక్కడి నుంచో చల్లటి గాలి వీస్తోంది. మృదువైన నాదం ఏదో వినిపిస్తోంది. అదేం రాగమో! అద్భుతంగా ఉంది. గోపాలావుగారు కళ్ల ముందు ప్రశాంతమైన వెలుగు. ఆ వెలుగులో దివ్యతేజస్సుతో ఎవరిదో ఆజానుబాహువు విగ్రహం. సమ్మోహనమైన స్వరంతో ఆ రూపం ఇట్లా అంది. "గోపాలావూ! నువ్వనుకున్నట్లుగానే నిన్నో రోజు గతంలోకి తీసుకెళ్తాను. ఒక్క రోజు మాత్రమే. నీ జీవితంలో నీకు ఆనందదాయకమైన రోజు ఏదో నువ్వే నిర్ణయించుకో. దీనికి గంట మాత్రమే సమయం." మాటలు వినిపించడం ఆగిపోయాయి. వెలుగు అదృశ్యమవుతోంది గానీ చల్లటిగాలి వీస్తూనే ఉంది. మురళీనాదం వినిపిస్తూనే ఉంది. గోపాలావుగారి మనసు ఆనందభరితమైంది. న్యాయమైన కోరికను భగవంతుడు తప్పక తీరుస్తాడు. తను రోగాలు లేకుండా చెయ్యి మరణం లేకుండా చెయ్యి అని అసంభవమైన కోరికలు కోరలేదు. ఒక్కరోజు తన జీవితంలోదే తనకిమ్మన్నాడు. ఏ రోజయితే బాగుంటుంది? తన పెళ్లిరోజు... కాదు, కాదు తనది కుండమార్పిడి సంబంధం. తండ్రికి అల్లుడు నచ్చడం వల్ల ఆ సంబంధం అయింది కానీ, తనకి పెళ్లికూతురు నచ్చడం వల్ల కాదు. పైగా తనకి అప్పుడు ఉద్యోగం కూడా లేదు. బావగారు పెద్ద ఉద్యోగస్తుడు. పెళ్లి అనగానే ఆ న్యూనతాభావమే గుర్తొస్తుంది. ఉద్యోగంలో చేరిన రోజు...నో...నో...తనకి ఇంకా పెద్ద ఉద్యోగమే వచ్చే అవకాశం ఉన్నా ఇటు తండ్రిగానీ, అటు మావగారు గానీ పైవాళ్ల "చేతులు తడిపేందుకు

"గోపాలావూ! ఏమాలోచించావు?" అంది దివ్యమైన కంఠస్వరం. "స్వామీ ఫలానా అని కాదు గానీ నా జీవితంలో నేను వయసులో హుషారుగా ఉన్న రోజేదైనా తిరిగి గడిపే అవకాశం ఇయ్యి!" కోరాడు గోపాలావు. "కానీ స్వామీ! ఆ రోజు నా నిరుద్యోగ పర్వంలోనిది మాత్రం కాకూడదు" దివ్యతేజస్సు చిరునవ్వు నవ్వినట్టు తోచింది.

"సరే గోపాలావు! అందరికీ అత్యంత ప్రియమైన కాలేజీ విద్యార్థి జీవితంలోకి నిన్ను పంపుతున్నాను" దివ్యతేజస్సు అదృశ్యమైంది.

* * *

అలారం మోతతో చెంగున పక్క మీంచి లేచాడు పద్దెనిమిది నిండిన గోపాలావు. చకచకా తయారై జాగింగ్‌కి బయల్దేరబోతుండగా గదిలో నుండి బద్ధకంగా వినిపించింది తల్లి గొంతు.

"గోపూ! వచ్చేటప్పుడు పాలు తెచ్చి పెట్టు నాన్నా! రాత్రి పాలవాడు రాలేదు".


గోపి వినుక్కున్నాడు.

"ఎప్పుడూ ఏదో పని చెపుతావేమ్మా! మళ్లీ గిన్నె, కేనో పట్టుకెళ్లాలి నేను. వచ్చాక తెస్తాలే" జాగింగ్ వంకతో వీధి చివర విమలను ఓ రెండుసార్లు చూడొచ్చు. అదీ గోపీ ఎత్తు! వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు కూడా ముగ్గు పెడుతూనో, పూలు కోస్తూనో కనిపించే విమల కనిపించలేదు. ఏదో వెలితిగా తోచింది గోపీకి. కాలేజికి వస్తుందో, రాదో. కొంపదీసి పెళ్లిచూపులు కాదు కదా! రకరకాల సందేహాలతో పరధ్యానంగా ఉండి తిట్లు తిన్నాడు ఇంట్లో వాళ్లతో. కాలేజీలో విమల కనిపించింది గానీ తనని చూసి నవ్వలేదు. పైగా తన పక్కనున్న అనంతాన్ని చూసి నవ్వినట్లు అనుమానం. మేథ్స్ క్లాసులో బోర్డుమీద లెక్క చెయ్యమ

న్నారు లెక్చరర్. అన్నీ తప్పులే. తిట్టిపోశాడు ఆయన. కెమిస్ట్రీ రికార్డు పూర్తి చేయలేదని మేడమ్ క్లాసు తీసుకుంది. ఇంగ్లీష్ క్లాసు ఎగ్గొట్టాడు. హిందీ క్లాసులో నిద్రపోయాడు. ఇంటికి రాబోతుండగా అనంతం రికార్డు పుస్తకం తీసుకుంటున్న విమలను చూశాడు. పళ్లు కొరుక్కున్నాడు. రికార్డు పూర్తి చేయని తన బద్ధకాన్ని తిట్టుకున్నాడు. ఇంటికెళ్లి అద్దంలో చూసుకుంటూ ఇంకా మీసాలు, గడ్డాలు రాలేదని మధనపడుతుండగా తల్లి గొంతు వినిపించింది.

“గోపూ! చెల్లాయిని టైపుక్లాసు నుంచి తీసుకురా నాన్నా! సందు చివర రౌడీ వెధవలుంటారు” గోపీకి నచ్చని పనుల్లో ఇదొకటి.

“ఎందుకమ్మా! దాన్ని అక్కడికీ ఇక్కడికీ పంపుతారు? హాయిగా పెళ్లి చేసెయ్యక?” అన్నాడు.



“నీ బోడి సలహా మాకక్కర్లేదు గానీ, ముందు చెప్పిన పని చెయ్యవోయ్” తండ్రి గర్జన వినిపించింది.

‘ఛీ! ఛీ! వెధవ జీవితం! ఎప్పటికైనా మంచి ఉద్యోగం, బాగా డబ్బు సంపాదించి, అప్పుడు చూపిస్తాను నా తడాఖా! అమ్మా, నాన్నలకి నలుగురు నౌకర్లని పడేస్తాను. చెల్లెలికి పెద్ద సంబంధం చేస్తాను. అప్పుడు అదే నాకు కాపలా కాస్తుంది. ఆడబడుచు కట్నం కోసం నన్ను కాకా పడుతుంది. వీధి చివర విమల తను కార్లో ఆఫీసుకెళుతుంటే ఆశగా చూస్తుంది. అందరికీ కుదురుతుంది తిక్క రోగం! అనంతంగాడు తన దగ్గర ఉద్యోగం కోసం వస్తాడు...’ వాలుకుర్చీలో రిటైర్డ్ గోపాల్రావు అసహనంగా కదిలారు. ఇదేమిటి? తన యవ్వనం ఇలా ఏడిసింది? అంతా అసహనం, చిరాకు, అర్థం లేని ఆరాటం, అంతం లేని ఆశలు. భగవాన్! నాకు వద్దు. ఆరాటమే గానీ ఆనందం లేని ఈ రోజులు కావు నేను కోరుకున్నవి. “పిలిచావా నాయనా” భగవాన్ అనుకోవడమే తడవుగా వినిపించింది భగవంతుని గొంతు. “స్వామీ! ఏమీ అనుకోకుండా నన్ను బాల్యంలోకి పంపు!” అభ్యర్థనగా అన్నారు గోపాల్రావు.

“తథాస్తు!”

“కానీ మిగిలింది పన్నెండు గంటలే” హెచ్చరించింది అంతర్యామి గొంతు.

★ ★ ★

కిటికీ పక్కగా కూర్చుని హోమ్‌వర్క్ చేసుకుంటున్నాడు గోపి. చెయ్యకపోతే రేపు పొద్దున టీచరేమో గానీ విధిగా పిల్లల పుస్తకాలు చూసి ప్రశ్నలు వేసే తండ్రి మాత్రం వీపు చీరేస్తాడు. కిటికీ పక్క నుంచి “హిస్” మన్న స్వరం వినిపించింది. కిటికీ లోంచి చూస్తే అరుగుమీద నక్కి కూర్చున్న అనంతం కనిపించాడు.

“అరేయ్! ఊరి చివర తోటలో జామకాయలు కోసు

కుందాం వస్తావా?" రహస్యంగా అడిగాడు.

"హోంవర్క్ చేయాలిరా!" బదులిచ్చాడు గోపి.

"వచ్చాక చేద్దూగానీరా, మీ నాన్నకి, మా నాన్నకి ఆఫీసులో మీటింగు, పొద్దుపోయాక వస్తారు."

"సరే" గుసగుసగా అని, "అమ్మా! ఇప్పుడే వచ్చేస్తాను." గట్టిగా అరచి వంటింట్లో ఉన్న తల్లికి వినబడిందో లేదో చూడకుండానే ఒక్క గెంతు గెంతాడు బయటికి. దారిలో ఇంకో ఇద్దరు పిల్లలని పోగేసి రహస్యంగా ఊరి చివర పాండురంగయ్యగారి తోటలో దూరారు. కాపలాదారు తోటకి ఆ మూల ఉన్నాడు. జామకాయలు కొయ్యడం వరకూ జట్టుగానే ఉన్నారు. పంచుకోవడంలోనే తేడా వచ్చి, గొంతులు పెరిగాయి. అలికిడికి కాపలాదారు కర్ర తీసుకుని "ఎవరది" అంటూ వెంట పడ్డాడు. కాళ్ల కింద ఎండుటాకులు నలుగుతుండగా పిల్లలు నలుగురూ పరుగెట్టారు. చొక్కల్లో జామకాయలు మూటగా పట్టుకున్నారు జేబులు సరిపోక. కోసిన వాటిలో సగం కిందే పడ్డాయి. పరిగెడుతుండగా హవాయి చెప్పుని చీల్చుతూ ఏదో కసుక్కున కాలిలో దిగింది గోపికి. ఒక్క క్షణం ఆగినా అలాగే పరుగెట్టాడు. ఇంటికొచ్చాక ఆగాడు. పాదం నిండా, దారంతా, చెప్పునిండా రక్తం. చెప్పునూ, పాదాన్నీ కలిపి కుట్టినట్టుగా దిగింది మేకు. "ఎక్కడ ఊరేగడానికి పోయావురా?" రుద్రమూర్తిలా వచ్చాడు తండ్రి. గోపి వాలకాన్ని చూసి, నరసింహావతారం ఎత్తేశాడు. చింత బరికెకు పని చెప్పాడు. జామకాయలు చెల్లా చెదురయ్యాయి. తండ్రిని తప్పించుకుందుకు కుంటుతూ ఒంటికాలితో ఇల్లంతా గెంతాడు గోపి. వాడి కాలి రక్తపు గుర్తులు చూసి కెవ్వుమంది తల్లి. తండ్రికి అడ్డు పడ్డందుకు ఆమెకీ తగిలాయి దెబ్బలు. వెక్కి వెక్కి ఏడుస్తూ నిద్రపోయాడు గోపి.

"బాబోయ్ వద్దు! వద్దు!" అరిచారు రిటైర్డ్ గోపాలావు. ఓ నెల రోజులు తాను ఆ గాయంతో పడిన బాధ గుర్తొస్తోంది ఆయనకు. తల్లికి కోపం వచ్చి తండ్రితో మాట్లాడ్డం మానేసింది కొన్ని రోజులు. అంతేకాదు. అంత గొడవకు కారణమైన జామకాయను అప్పటి నుంచి ఆవిడ చేతితో కూడా తాకలేదు జీవితాంతం. జామకాయను చూస్తే రక్తమోడుతున్న తన పాదం గుర్తొస్తుందని చెప్పేది. చెల్లి అప్పటికి చిన్నది. అయినా అదీ జామకాయ తినడం మానేసింది. ఆత్మీయుల జ్ఞాపకాలతో మరింత బరువెక్కింది గోపాలావు హృదయం. ఇదేమిటి? తన బాల్యం ఇలా ఉందా? అల్లరి, దెబ్బలు, తిట్లు, భయం, వద్దన్న పని చెయ్యాలన్న పంతం! భగవంతుడా! ఎంత బాధాకరం. ఇంత జీవితంలో ఒక్క ఇరవై నాలుగ్గంటలు, ఒక్క రోజు పూర్తిగా ఆనందంగా గడపలేకపోయానా? కనీసం తీపి జ్ఞాపకానికైనా ఒక్కరోజు మిగుల్చుకోలేకపోయానా?

"పిచ్చి గోపాలావూ!" అచ్చం అమ్మ గొంతులాగే మెత్తగా ఉంది స్వామి గొంతు. తాను భగవంతుడ్ని తలుచుకున్నానని జ్ఞాపకం వచ్చింది ఆయనకు.

"నువ్వు అనవసరంగా హైరానా పడుతున్నావు. జీవితాన్ని సంపూర్ణ దృష్టితో చూడ్డం నేర్చుకో. సుఖదుఃఖాల సమ్మిళితమే జీవితం. ఈ రెంటినీ సమదృష్టితో చూసేవాడు స్థితప్రజ్ఞుడు. అతడే నువ్వనుకుంటున్న ఆనందాన్ని అనుభవించడానికి అర్హుడు" ఈసారి భగవద్గీత చెపుతున్న ఘంటసాలగారి గొంతులా ఉంది స్వామి స్వరం.

"స్వామీ! నాకు అర్థమయ్యేలా చెప్పు!"

"సరే గోపాలావు! జీవితంలో ఏ వయసుకు తగ్గ బాధ్యతలు, సుఖాలు, కష్టాలు ఆ వయసుకి ఉంటాయి. నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వర్తిస్తూ ఫలితం కోసం..."

"స్వామీ!" స్వామి మాటలకు అడ్డు వస్తూ-"నేను నీ గీత అంతా కంఠతా పట్టాను" అన్నాడు గోపాలావు.

"ఏం లాభం!" నిట్టూర్చాడు స్వామి.

"సరే! నువ్వు నీ జీవితమంతా ఎవరికో ఒకరికి భయపడుతూ, ఎవరో ఒకరి ఆధీనంలో ఉంటూ వారి కోసం కష్టపడ్డావు"

"అవును! స్వామీ అవును!" ఆనందంగా అన్నాడు గోపాలావు.

"ఇప్పుడు నువ్వు ఎవరి కోసం కష్టపడాలి?" ప్రశ్నించాడు స్వామి.


"ఎవరి కోసమూ కాదు" గొణుక్కున్నాడు గోపాలావు.

"ఇప్పుడే నీ కోసం నువ్వు జీవించే అవకాశం వచ్చింది గోపాలావు! నీ మనసుకి ఆనందం కలిగే పనులు చేస్తూ ప్రతి క్షణం ఆస్వాదిస్తూ నిర్భయంగా జీవించు. నువ్వు చాలా అదృష్టవంతుడివి. చాలామందికి ఉండే భవబంధాలు, వ్యామోహాలు నీకు చాలా తక్కువ. ఆ నిరాసక్తతను నీకు అనుకూలంగా మార్చుకో. నిజానికి నువ్వు కోరుకుంటున్న ఆనందానికి నువ్వు చాలా దగ్గరలో ఉన్నావు" నర్మగర్భంగా నవ్వాడు అంతర్యామి.

"ప్రయత్నిస్తాను స్వామీ!"

★ ★ ★

పక్కింట్లో అలారం మోతతో మెలకువ వచ్చింది గోపాలావుకి. కాసేపు పక్కమీదనే శరీరాన్ని స్ట్రెచ్ చేస్తూ ఆ రోజు చేయవలసిన పనులు ఆలోచించుకున్నాడు. కాలకృత్యాలు తీర్చుకుని కొద్దిసేపు ధ్యానం చేసుకొని బయటకు వచ్చాడు. కోడలు బాత్‌రూమ్‌లో ఉన్నట్టుంది. స్టౌమీద పాలు పొంగబోతున్నాయి. కాఫీ కలుపుతూ అప్పుడే లేచిన కొడుకుకి గుడ్‌మార్నింగ్ చెప్పాడు. కాఫీ మూడు కప్పుల్లో పోసి నొచ్చుకుంటున్న కోడలిని వారిస్తూ, వారితో కబుర్లు చెపుతూ కాఫీ తాగాడు. వాకింగ్‌కి వెళ్లి ఫ్రెండ్స్‌తో రాజకీయాలు మాట్లాడాడు. జోక్స్ చెప్పి నవ్వించాడు. అంతా అక్కడే ఓ పది నిమిషాలు చిన్న చిన్న ఎక్స్‌ర్‌సైజ్‌లు చేసి ఇంటికి వచ్చేటప్పటికి కోడలు గేటులోనే ఉంది.




"నా దగ్గర కీ ఉంది కదమ్మా" అన్నాడు గోపాలరావు.

"రిక్షా రాలేదండీ" అంది కోడలు.

మెయిన్‌రోడ్డు మీదకు వెళ్లి రిక్షా తేవడానికి టైము పడుతుంది. ఒక్క క్షణం మాత్రమే ఆలోచించాడు. మూలనున్న బజాజ్ దుమ్ము దులిపాడు. కొద్ది ప్రయత్నంలోనే స్టార్ట్ అయింది. కోడలిని దింపి వస్తుంటే ఒక చిన్న పాప క్లాసుకి వెళ్లకుండా ఏడుస్తూ కనిపించింది. గోపాలావు ఆ పాపను బుజ్జగించి తన స్కూటర్ మీద రెండు రౌండ్లు తిప్పాడు.

పాప క్లాసులోకి వెళ్తూ "సాయంత్రం వస్తావా తాతయ్యా?" అని అడిగినప్పుడు అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందాడాయన.

తిరిగి వచ్చాక టిఫిన్ తిని మందులు వేసుకుని తను పెంచుతున్న మొక్కలని చూసుకుని కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాడు.

తర్వాత లైబ్రరీకి వెళ్లి, వస్తూ వస్తూ తను ఎప్పటి నుంచో దత్తత తీసుకుందామనుకుంటున్న గవర్నమెంటు స్కూలుకి వెళ్లి టీచర్లతో మాట్లాడాడు. పిల్లలని పలకరించాడు. ఇంటికి వచ్చేటప్పటికి ఆకలి కరకరమంటోంది అన్నం తిని. అన్నీ అలాగే వదిలేయక శుభ్రం చేశాడు. కాస్సేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం టీ చేసుకుని తాగి మొక్కలకి నీళ్లు పోసి కోడలు వచ్చాక కాస్సేపు ఆమె కబుర్లు విని గుడికి వెళ్లాడు.

ఇంటికి వచ్చాక హాస్టల్‌లో ఉన్న మనవడికీ, మనవరాలికీ ఉత్తరాలు రాశాడు.

ఇలా ప్రతీ క్షణం ఆనందంగా జీవించాడు గోపాలావు. ఇతరులకు సంతోషం కలిగించడానికి వచ్చిన ఏ చిన్న అవకాశమూ వదులుకోలేదు. అందులో అతడి స్వార్థం లేదు కాబట్టి వారి మెప్పు ఆశించలేదు కాబట్టి నిజమైన తృప్తి, ఆనందం పొందేవాడు.

నిజానికి అతను ఇప్పుడు పాపులర్ అయ్యాడు. తనవంటి వారెందరికో జీవించడం నేర్పాడు. తను కోరుకున్న పూర్ణానందాన్ని అనుభవిస్తూ సర్వాంతర్యామి ప్రసాదించే అలౌకిక ఆనందానికి అర్హుడయ్యాడు.